క్లుప్తంగా

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ



అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): స్థానిక గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న ఆర్కా, జేఎస్ఆర్, స్టార్‌కేర్, సహస్ర తదితర ఆసుపత్రులను సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫైర్ ఎన్ఓసీ తప్పనిసరిగా ఉండాలని, 50వేల లీటర్ల సామర్థ్యం నీటి ట్యాంకు ఉండాలని, తాగునీటి వసతి కల్పించాలని, విద్యుత్ సంబంధిత వైరింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. వడదెబ్బతో వచ్చే వారికి చికిత్స నిమిత్తం కూల్ పాడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రికి వచ్చే వారికి వడదెబ్బ గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట డిస్ట్రిక్ట్ సర్వైలెన్స్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ ఉన్నారు.

పాత పద్ధతిలోనే డ్యూటీ రోస్టర్ వేయాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాల్గవ తరగతి ఉద్యోగులకు పాత పద్ధతిలోనే డ్యూటీ రోస్టర్ వేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం వారు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని కలిసి విన్నవించారు. గతంలో సార్జంట్ ఆధ్వర్యంలో నాల్గవ తరగతి ఉద్యోగుల డ్యూటీ రోస్టర్ వేసేవారని, ఇప్పుడు కొందరు అధికారులు ఇందులో జోక్యం చేసుకుంటున్నారని, తమను దుర్భాషలాడుతున్నారని వారు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు, ఉద్యోగులతో చర్చించి సమస్య పరిష్కరించారు. పాత పద్ధతిలోనూ డ్యూటీ రోస్టర్ వేసేలా ఆదేశాలు జారీ చేస్తామని డాక్టర్ వెంకటరంగారెడ్డి హామీ ఇచ్చారు.

బీజేపీ నేత నరసింహ వర్మ మృతి



కాళింగి నరసింహ వర్మ(ఫైల్)

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు కాళింగి నరసింహ వర్మ (62) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం అర్ధరాత్రి ఓల్డ్‌సిటీలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆర్ఎస్ఎస్, జన సంఘ్, బీజేపీలో వివిధ హోదాల్లో 40 ఏళ్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లాలోని బీజేపీ సీనియర్ నాయకుల్లో ఈయన కూడా ఒకరుగా ఉన్నారు. బాబ్రీ మసీదు కేసులో జైలుకు సైతం వెళ్లారని జిల్లా పార్టీ నాయకులు వెల్లడించారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితిలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు వివిధ ధార్మిక సంఘాల్లో కీలకంగా వ్యవహరించారు. బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు టీజీ వెంకటేష్, కపిలేశ్వరయ్యతో పాటు పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. హారతుల అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని చిత్తుగా ఓడిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



బహిరంగ సభకు ఎత్తున హాజరైన మహిళలు

- బీజేపీతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తే ఖబడ్దార్
- కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

కర్నూలు (టౌన్): బీజేపీ, జనసేన, ఎల్లో మీడియాతో కలసి పేదలపై పెత్తనం చెలాయించాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీని చిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం రాత్రి స్థానిక కొత్తపేటలో కార్పొరేటర్ షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు కర్నూలు ఎంపీ అభ్యర్థి రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ముస్లిం వర్గాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో సీఎం జగన్ 4 శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తున్నారన్నారు. ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్న భారతీయ జనతా పార్టీతో టీడీపీ జతకట్టిందన్నారు. ముస్లింలు కూటమి కుయుక్తులను గ్రహించాలన్నారు. ఒక్కడిని ధైర్యంగా ఎదుర్కోలేక తెలుగుదేశం పార్టీ ఇతర పార్టీలతో కూటమిగా పోటీ చేస్తోందన్నారు. ఐదేళ్ల పాటు మంచి పాలన అందిస్తున్న జగనన్నకు ఓటు వేసి కర్నూలు ఎంపీగా రామయ్యను, ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌ను గెలిపించాలని కోరారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ సిద్ధం, మేమంతా సిద్ధం సభలతో జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో విశేషమైన ప్రజాదరణ వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలకు తాళాలు వేసుకోవాల్సిందేనన్నారు. చంద్రబాబు ప్రకటించిన బూటకపు హామీలను నమ్మితే మోసపోతారన్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పాలన నచ్చే వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. పేదలకు సేవ చేసేందుకే తాను వచ్చానన్నారు. ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీతో జతకట్టిన టీడీపీ కర్నూలులో మతపెద్దలను వేధిస్తోందని, ఓటుతో వారికి బుద్ధి చెప్పాలన్నారు. సభలో పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

కర్నూలు (టౌన్): స్థానిక ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో సోమవారం పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ పక్రియ ప్రారంభమైంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకే సెంటర్‌లో ఏర్పాటు చేసిన 6 కౌంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈనెల 8 వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ సెంటర్‌కు రాలేని వారికి హోమ్ ఓటింగ్ అవకాశం ఉంటుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. కాగా మొదటిరోజు సాయంత్రానికి 6 కౌంటర్లలో 1,254 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



పార్టీలో చేరిన సీపీఐ కుటుంబాలతో రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. సోమవారం స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో సీపీఐకు చెందిన 500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు కుటుంబాలు తమ పార్టీలో చేరడం హర్షించదగ్గ విషయమన్నారు. వామపక్షాలు సైతం జగనన్న సంక్షేమ పథకాలకు జై కొడుతున్నారన్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ జగన్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సీపీఐని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారి లో ఎస్ఎస్ రసూల్, గోవిందు, షేక్ ఫక్రుదీన్, గోపి, ధనలక్ష్మి, షేక్ షబ్బీర్ తదితరులు ఉన్నారు. అలాగే పూలబజార్, బళ్లారి చౌరస్తా, జంపాల శివయ్య నగ ర్, తిలక్ నగర్, ఇందిరాగాంధీ నగర్, ఖండేరి, వన్‌టౌన్ గని గల్లి, ఏక్యాంప్, బంగారుపేట ప్రాంతాల నుంచి కూడా భారీగా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక 45వ వార్డులోని కప్పల్ నగ ర్, భగత్‌సింగ్ నగర్ కాలనీలకు చెందిన కేబుల్ దాసు ప్రభుదాసు, మిత్ర బృందం 150 మంది టీడీపీని వీడి వైస్సార్‌సీపీలో చేరారు. వీరికి నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్ ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ కండువాలు కప్పి సా దరంగా ఆహ్వానించారు. ప్రభు త్వ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఈనెల 13న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏఎండీ ఇంతియాజ్

హ్యాట్రిక్ విజయం ఖాయం



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీవై రామయ్య, పక్కన ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, మణిగాంధీ

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, డాక్టర్ ఆదిమూలపు సతీష్
- గార్గేయపురంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- భారీగా హాజరైన ప్రజలు

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, మణిగాంధీతో కలిసి వారు సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఓటు వేయాలని కోరారు. అనంతరం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భగా భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి వారు మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలనను ప్రజల ముంగిటకే తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కుల, తమ, రాజకీయాలకు అతీతంగా పలన సాగిస్తున్న జగనన్నను చూసి చంద్రబాబుకు కడుపు మంటగా ఉందన్నారు. అందుకే ఆయన అభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగులుతున్నాడన్నారు. 2014 అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత ప్రజలను మోసం చేశాడన్నారు. అవే హామీలతో ఏర్పాటు చేసిన మేనిఫెస్టోతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నాడని జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించే జగనన్న ప్రభుత్వం కావాలో, మోసం చేసే చంద్రబాబు ప్రభుత్వం కావాలో ఆలోచించి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, మౌలాలి, మండల కన్వీనర్ మహబూబ్‌బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు డి.వాసు, సింగిల్ విండో చైర్మన్లు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, రమణారెడ్డి, ఎల్లారెడ్డి, బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సత్యంరెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు ప్రశాంత్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ ప్రసాదు, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు హనుమంతు, రామ్‌నాథ్ రెడ్డి, శేఖర్, మాజీ సర్పంచులు పెరుగు భాస్కర్ రెడ్డి, బీచుపల్లి, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, మోహన్ బాబు, సర్పంచ్‌లు విద్యాసాగర్, శ్రీనివాసులు, గొందిపర్ల గోపాల్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ అజీజ్, అల్లావుద్దీన్, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, నిడ్జూరు సంపత్, జి.శింగవరం వెంకటేశ్వరరెడ్డి, రవిరెడ్డి, ఆదాము, దిగువపాడు గోపాల్ రెడ్డి, వీరభద్రారెడ్డి, సత్యంరెడ్డి, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ, అభివృద్ధి సాధ్యం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్): ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక 25వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, 6వ వార్డు పరిధిలోని గరీబ్ నగర్, 8వ వార్డు పరిధిలోని పెద్దపడఖానాకాలనీల్లో ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గద్దం రామకృష్ణ,6వ వార్డు కార్పొరేటర్, నీలోఫర్, 8వ వార్డు ఇన్‌చార్జ్అబ్రార్,శివ,ఫరూక్,రంగ,జాకీర్ పాల్గొన్నారు.

బీజేపీది నియంత పాలన

కల్లూరు: బీజేపీది నియంత పాలన అని.. ఆ పార్టీని ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 పార్లమెంట్ ఎన్నికలు దేశానికి చాలా కీలకమని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలనే ఆయుధంగా చేసుకుని పాలన చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, సీపీఎం పాణ్యం అభ్యర్థి గౌస్ దేశాయ్, నంద్యాల కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీ నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఓటు వేయాలని కోరుతున్న సమీనా ఇంతియాజ్, విజయ మనోహరి

కర్నూలు (టౌన్): ప్రతి ఇంటికి సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా ఇంతియాజ్ కోరారు. సోమవారం రాత్రి 48వ వార్డు రోజా వీధిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరితో కలసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈనెల 13న వీవీ ప్యాట్‌లోని రెండవ నెంబర్ ఇంతియాజ్ ఫొటో ఎదురుగా ఫ్యాన్‌కు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు బైటిపేటకు చెందిన మనోహర్ అదే వీధిలో దారిన పోయే మహిళల పట్ల ఈలలు, కేకలు కనుసైగలు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధించాడు. స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సారథ్యంలోనే సంక్షేమ రాజ్యం తెచ్చుకునేందుకు ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకుందామని కల్లూరు అర్బన్ 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 32 వార్డులోని వివిధ కాలనీలో అధిక సంఖ్యలో మహిళలు, యువతతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలు, నెరవేర్చలేని హామీలున్న మేనిఫెస్టోను నమ్మవద్దన్నారు. నవతర్నాల పథకాలు కొనసాగలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆదరించాలన్నారు. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యేగా మరోసారి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటే వార్డు మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శివ, యస్వంత్, బాబు, షేక్షావలి రాజు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి అనంతరం గ్రామంలోని కల్లందొడ్డి లో వేసుకున్న గడ్డి వా ములకు అగ్గిరాజేసుకుని మంటలు చెలరేగాయి. రాముడు, సుదర్శనంకు చెందిన గడ్డివాములు కాలిపోతుండడాన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేయాలని యత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తగా కలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

H.M.O.P. No. 232/2023

Between:

Maddela (Sape) Prajitha, W/o. Maddela Satish Chandra, D/o. Sape Bala Raju, S.C., aged 24 years, House wife, resident of Door No. 20-463/114, Revenue Colony, Bommuru, Rajamahendravaram Rural, East Godavari District. ...*Petitioner*

AND

Maddela Satish Chandra, S/o. Maddela Raghunadha Rao, Hindu, aged 27 years, resident of Door No. 45-142/A-17, Room No.3, V.R.Colony, Rajiv Gandhi Park, Kurnool, A.P. ...*Respondent*

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 21-6-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 07-5-2024 — పి.నందకిషోర్, అడ్వకేట్, రాజమండ్రి

ప్రలోభాల ఎర.. తప్పదు చెర!

- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి టీడీపీ తాయిలాలు
- కానుకలు పంపిణీ చేస్తూ పట్టుబడితే ఏడాది జైలు
- అబద్ధాల ప్రచారం, బెదిరింపులకు పాల్పడితే నేరమే



కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు మే 13న జరగనున్నాయి. అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నం కాగా, అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో గెలవడానికి టీడీపీ అభ్యర్థులు చేయని ప్రయత్నం లేదు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి కర్నూలులో నెల రోజుల ముందు నుంచే తాయిలాలు, నగదు అందిస్తున్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేసినా ఎన్నికల చట్టం ప్రకారం నేరమే. ప్రభావితం చేసినవారిపై భారతీయ శిక్షా స్మృతి ప్రజాప్రాతినిధ్య చట్టం (రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్) 1951, ఎక్సైజ్ చట్టం -1968 ప్రకారం పలు రకాల కేసులు నమోదు చేస్తారు. ఏయే నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలుసుకుందాం..

ఓటర్లకు డబ్బు పంచితే..

ఎన్నికల్లో గెలవడానికి టీడీపీ అభ్యర్థులు ఓట్లతో నోట్లను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ పట్టుబడితే ఐపీసీ 171 (ఇ) ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశముంటుంది. ప్రజా ప్రాతినిధ్యం చట్టం ప్రకారం శిక్షలు అమలు చేస్తారు.

కానుకలు పంపిణీ చేస్తే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకర్షించడానికి కానుకలు అందించినా నేరమే. మహిళలకు చీరలు, గృహోపకరణాలు, యువకులకు క్రీడా కిట్లు, సెల్ ఫోన్లు... ఇలా ఏవి ఇచ్చినా నేరమే. కర్నూలులో టీడీపీ అభ్యర్థి మహిళలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.2 లక్షల విలువ చేసే చీరలు అధికారుల తనిఖీల్లో పట్టుబడగా వాటిని సీజ్ చేసి విచారణ జరుపుతున్నారు. ఆధారాలతో నేరం రుజువైతే ఐపీసీ 171 (ఇ) ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

అబద్ధాలతో ప్రచారం నేరమే..

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు అబద్ధాలు చెబుతూ ప్రచారం చేసినా నేరమే అవుతుంది. లేనివాటిని ఉన్నట్లు చెప్పడం, రాజకీయ ప్రత్యర్థులపై తీవ్రమైన నిందలు వేస్తూ అబద్ధాలు చెప్పడం నేరంగా పరిగణిస్తారు. అందుకు ఐపీసీ 171 (జి) ప్రకారం జరిమానా విధిస్తారు.

విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే..

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచేలా విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీ యాక్ట్) 125 ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండూ విధించవచ్చు. ఎవరూ మతాలు, వర్గాలను కించపరిచేలా మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడరాదు.

బెదిరింపులకు పాల్పడితే..

ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని అభ్యర్థులు, పార్టీ నాయకులు ఓటర్లను బెదిరించకూడదు. రిజర్వ్‌డ్ నియోజకవర్గం కోడుమూరులో ఓ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు తాను బలపరచిన వ్యక్తికి ఓటు వేయాలని పట్టున్న గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలా చేస్తే ఐపీసీ 171(సి) ప్రకారం కేసు నమోదు చేస్తారు. రుజువైతే ఏడాది జైలుతో పాటు జరిమానా విధించే అవకాశముంది.

మద్యం పంపిణీ చేస్తే..

ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మద్యం పంపిణీ చేస్తుంటారు. అనుమతి లేకుండా పరిమితికి మించి మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా, ఓటర్లకు పంపిణీ చేసినా కేసు నమోదు చేస్తారు. సారా, కల్లు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు ఏవి ఇచ్చినా నేరమే. పట్టుబడిన సారా, మద్యాన్ని బట్టి ఎక్సైజ్ చట్టం 1968 సెక్షన్ 34 (ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది జైలు శిక్ష ఉంటుంది. రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధిస్తారు.